ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శనివారం | 25 ఏప్రిల్ , 2026 | పేజీలు : 06




వివరాలు మెయిన్‌లో

నల్లగొండ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు

# కార్మికులకు సిపిఐ అండ



## ఆర్‌టిసి కార్మికుల సమ్మె న్యాయబద్ధమైనదే

### సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### ప్రతిష్టకు పోకుండా చర్చలు జరిపించాలి

### ప్రభుత్వం దిగొచ్చేంత వరకు ఆందోళనలు శాంతియుతంగా నిర్వహించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన సమ్మె న్యాయబద్ధమైనదని ఆర్‌టిసి కార్మికుల సమస్యలు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి డిపో ముందు జరుగుతున్న మూడో రోజు సమ్మెకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికులు, ఉద్యోగులు సహనం కోల్పోవద్దని తీవ్ర చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ఆర్‌టిసి కార్మికులు చేసిన కృషి గుర్తించుకోవాలన్నారు. పిఆర్‌సి చట్టబద్ధంగా అమలు చేసే అంశం కాబట్టి ఎలాంటి ఇబ్బందులు ప్రభుత్వానికి ఉండబోవని గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన గుర్తింపు యూనియన్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు వాటిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇకనైనా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకపోతే ఆర్‌టిసి కార్మికులకు సిపిఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గురువారం నర్సంపేట డిపో వద్ద శంకర్ గౌడ్ అనే కార్మికుడు నిప్పంటించుకొని 80 శాతం కాలి చనిపోయిన కార్మికుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నల్లగొండ, భద్రాచలం ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యాయత్నం చేశారని ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కాదని కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఆర్‌టిసి కార్మికులతో తగువు పెట్టుకుంటే పతనం తప్పదని యూనియన్ అంటే పాలకులకు భయమెందుకు అన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆర్‌టిసి కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆర్‌టిసి కార్మికులు పాల్గొన్నారు.




## అధైర్య పడకుండా పోరాడి హక్కులు సాధించుకోవాలి

### సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** ఆర్టీసీ కార్మికులు ఆధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని తెగించి పోరాడి తమ హక్కులను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం పెరబోయిన మహేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులపై కక్షసాధింపు చర్యలను మానుకోవాలని ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సిపిఐ వారికి అండగా ఉంటుంది అని అయన అన్నారు. డీ లిమిటేషన్ బిల్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, నియంత్రత్వాన్ని ప్రజాస్వామ్యం ఓడించిందని, డి లీమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టడం దాన్ని ప్రతిపక్షాలు అన్ని ఏకమై బిల్లుని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడయన్నారు. డీ లిమిటేషన్ బిల్లు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ముప్పుగా నిలుస్తోందన్నారు. ప్రజల ప్రతినిధిత్వాన్ని సమానంగా కల్పించాల్సిన ప్రక్రియను రాజకీయ లాభాల కోసం వక్రీకరించే ప్రయత్నంగా ఈ బిల్లు కనిపిస్తోందని ఏద్దేవా చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ అనేది జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్వ్యవస్థీకరించడం కోసం ఉండాలి, అయితే ఈ బిల్లు ద్వారా కొన్ని రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాలపై వివక్ష చూపుతూ, ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇవ్వాలనే కుట్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, కల్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, అశోక్ పాల్గొన్నారు.

# త్వరలో అంగడిపేటకు చందూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు

### అద్దె భవనం వీడి ప్రభుత్వ భవనంలోకి మార్పు

### సంతోషం వ్యక్తం చేస్తున్న అంగడిపేట ప్రజలు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం త్వరలో మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటకు మార్పుకానుంది. చండూరులో ప్రభుత్వ భవనంలో కాకుండా అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్నది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలలోకి మార్చాలని ప్రభుత్వం అదేశాలు జారీచేయడంతో అద్దె భవనంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అద్దె భవనంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంను కూడా అండగిపేటలోని పాత గ్రామ పంచాయితీ భవనంలోకి తరలించారు. అంగడిపేట గ్రామం చండూరు మున్సిపాలిటీలో విలీనం కావడంతో అక్కడ నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవనం కూడా ఖాళీగా ఉన్నది. నూతనంగా నిర్మించిన ఈ భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు అన్ని వసతులు ఉండడంతో సంబంధిత అధికారులు ఇక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయుటకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మే3 సోమవారం




రోజున అంగడిపేటలోని నూతన భవనంలో చండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కార్యకలాపాలు కొనసాగించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం . చండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మునుగోడు మండలంలోని 21గ్రామాలు , చండూరు మండలంలోని 16గ్రామాలు , మర్రిగూడెం మండలంలోని 14గ్రామాలు , గట్టుప్పల మండలంలోని 6గ్రామాలతో కలిపి మొత్తం 3 మండలాలకు చెందిన 57 గ్రామాల పరిధిలో చండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సేవలు అందించనున్నది. అంగడిపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కానుండడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**అంగడిపేటలో ఏర్పాటు చేయడం సంతోషం**

**కాంగ్రేస్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్**



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంను మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉన్నది. అంగడిపేటను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు అంగడిపేటలో ఏర్పాటు ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# దుశ్చర్ల దాడికి నిరసనగా రాస్తారోకో



**ప్రజాపక్షం/మోతె :** దుచ్చర్ల దాడి చేశాడంటూ నిరసనగా సూర్యాపేట ఖమ్మం రహదారిపై రాస్తారోకో నిర్వహించిన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్య లింగయ్య కుమారులు తెలిపిన వివరాల ప్రకారం రాఘవాపురం ఎక్స్ రోడ్డులో దుచ్చర్ల సత్యనారాయణ పొలం గెట్టు మా గెట్టు పక్క పక్కనే ఉండటంతో మూగ జీవాలను మేపుతున్న క్రమంలో మేకలు, గొర్రెలు దుచ్చర్ల సత్యనారాయణ వ్యవసాయ భూమిలోకి వెళ్లగా వాటిని బయటకు తరిమివేస్తూ ఆయన మా తండ్రి అయిన బయ్య లింగయ్య, మేకల కృష్ణయ్యలపై తన చేతి కర్రతో చితకబాధారని ఆరోపించారు. అది చూసిన పక్క వారు మాకు సమాచారం ఇవ్వగా మేము అక్కడకు చేరుకోగానే సత్యనారాయణ, అతని అనుచరులు కర్రలతో, రాళ్ళతో మాపై దాడి చేశారని ఆత్మరక్షణ కొరకు తిరిగి దాడి చేశామన్నారు. ఈ విషయమై నేరుగా వెళ్ళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వన్యప్రాణుల కోసం అడవిని పెంచిన ఆయన మూగ జీవాలు మేతకు వెళ్తే మాపై ఎందుకు అంత కోపంతో విచక్షణ కోల్పోయి కర్రతో దాడి చేశాడో చెప్పాలన్నారు. పోలీసులు సైతం మాపై కక్ష సాధింపు చర్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం మోతె ఎస్ఐ అజయ్ కుమార్ వారితో రాస్తారోకో విరమింపచేసి స్టేషన్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు మల్లయ్య, గంగయ్య, వీరన్న, గణేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# వ్యాపారస్తులు సామాజిక సేవ చేయడం అభినందనీయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వ్యాపారస్తులు కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని ఒక మజ్జిగ పంపిణీ కార్యక్రమమే కాకుండా గత 18 సంవత్సరాలుగా క్లాక్ టవర్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులకు శుద్ధి చేసిన తాగునీరు అందించడం గొప్ప సేవా కార్యక్రమమని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి ప్రశంసించారు.ది నల్లగొండ ఫైనాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్(రిజిస్టర్)ఆధ్వర్యంలో క్లాక్ టవర్ సెంటర్‌లో వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆమంచి రాజలింగం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి లు మాట్లాడుతూ వ్యాపారంతో పాటు సమాజానికి తమ వంతు సేవ చేయాలనే ఆలోచనతో సభ్యుల సహకారంతో ప్రతిరోజు 500 నుంచి 600 మందికి మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి మామిడి శ్రావణ్ కుమార్,మజ్జిగ దాతలు డాక్టర్ బొడ్డుపల్లి శివప్రసాద్,ఆమంచి విజయకుమార్,ముంత మల్లేష్, బొడ్డుపల్లి రమేష్,కంభంపాటి నరసింహ,చిట్టిమల్ల జానయ్య,కోమటి శ్రీనివాస్,ఆమంచి శేఖర్,బొల్లెద్దు లింగయ్య,మిట్ట వెంకట నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# ప్రాపర్టీ ట్యాక్స్‌పై 5 శాతం రాయితీకి ఇంకా 6 రోజులే



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ పొందేందుకు కేవలం 6 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని,ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర కోరారు.శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర ప్రజలు తమ ప్రాపర్టీ పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించి,ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును తక్షణమే చెల్లించి,రాయితీ ప్రయోజనాన్ని పొందాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా నగర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయన్నారు.పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా,రహదారుల అభివృద్ధి, వీధి దీపాల నిర్వహణ, వర్షపు నీటి కాల్వల శుద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాథమిక సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి పన్నుల వసూలు కీలకమని తెలిపారు. పౌరులందరూ ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు వాటర్ ట్యాక్స్ అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా చెల్లించాల్సిందిగా కోరారు. ప్రజల సహకారం లేకుండా నగర అభివృద్ధి సాధ్యం కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించడం ద్వారా నల్లగొండను మరింత పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. పౌరులందరూ చివరి తేదీకి ముందుగానే తమ పన్నులను చెల్లించి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీని వినియోగించుకోవడంతో పాటు, నగరాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాల్సిందిగా కమిషనర్ కోరారు.



# ఘనంగా ధ్వజ స్తంభం, బొడ్రాయికి పూజలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని చెట్లముకుందాపురం గ్రామంలో కనకదుర్గమ్మ దేవాలయ కమిటి ఆధ్వర్యంలో నూతన గుడుల నిర్మాణంలో భాగంగా మే 9 నుంచి 13 వరకు జరిగే ఉత్సవాలలో సందర్భంగా శుక్రవారం వరంగల్ నుంచి గ్రామానికి గరుడ స్తంభం, బొడ్రాయి తీసుకరాగా గ్రామ మహిళలు పసుపు, కుంకుమల జలబిందెలతో ఘనంగా స్వాగతం పలికారు. డప్పు చప్పులతో, బ్యాండ్ మేళాలతో, భక్తి గీతాలు ఆలపిస్తూ ఊరేగింపుగా గ్రామానికి తీసుకవచ్చారు.

# పంచాయతీ కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** గ్రామ పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీ కార్మికుల సంక్షేమమే మా ధ్యేయమని సర్పంచ్ ఇటుకల శ్రీను అన్నారు. శుక్రవారం మండలంలోని మాచారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన కార్మికులకు ఇన్సూరెన్స్ (భీమా) సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం రూ.750 ప్రీమియంతో రూ.15లక్షల భీమా రక్షణ లభించడం కార్మికులకు కొండంత అండ అన్నారు. అనంతరం జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనిరెడ్డి సరితా సందీప్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు సందీప్, సైదులు, లక్ష్మణ్, నాగరాజు, మంగ్తా, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# చెక్కు అందజేత

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం శివారెడ్డి గూడెంకు చెందిన గుండె మౌని సరిత మల్లేష్ యాదవ్ ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో బాధితుడికి రూ 2.50 లక్షల ఎల్వోసీ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, గ్రామ సర్పంచ్ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ సంతోష్ యాదవ్, గ్రామశాఖ అధ్యక్షులు మేకల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్ గుగులోతు లచ్చిరాం అన్నారు. శుక్రవారం మండలంలోని గూడెపుకుంట తండ గ్రామ పంచాయితీ కార్యాలయంలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీరాజ్ వ్యవస్థ ద్వారానే గ్రామాలకు స్వయం ప్రతిపత్తి లభిస్తుందన్నారు. అనంతరం నీరు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్య నాగలక్ష్మి నాగేందర్, పంచాయితీ కార్యదర్శి సతీష్‌కుమార్, వార్డు సభ్యులు భూక్యా పద్మ సురేష్, గుగులోతు రాందాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# మహిళా అభ్యున్నతిలో ఆర్‌పిల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మహిళా అభివృద్ధికి ఆర్‌పిల పాత్ర కీలకమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్టార్ బ్యాంకెంట్ హాల్‌లో పట్టణ పేదరిక నిర్మూల సంస్థ మెప్మా, సమాఖ్య అధ్యక్షులు, రిసోర్స్ పర్సన్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వారు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్యన ఉన్న సూర్యాపేటలో 25వేల మంది మహిళలు భాగస్వాములుగా ఉన్నారన్నారు. సూర్యాపేట మున్సిపాలిటి 16 సంవత్సరాల క్రితమే ఉత్తమ మున్సిపాలిటిగా అవార్డు పొందిందని ఇప్పుడు కూడా అవార్డు వచ్చేలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# నగరంలో షెడ్లు ఏర్పాటు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులు,ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో తాత్కాలిక వేసవి షెడ్లు ఏర్పాటు చేస్తునట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర తెలిపారు. మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు,మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మార్గదర్శకత్వంలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు,మార్కెట్ ప్రాంతాలు,బస్ స్టాండ్లు వంటి ప్రదేశాలకు వెళ్లే ప్రజలు ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ఈషెడ్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

# హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు



**ప్రజాపక్షం/నూతనకల్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పిసిఘోష్ కమీషన్ నివేదిక తప్పుల తడక అని, ఈ రిపోర్టు ప్రకారం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిల్ గౌడ్, సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, మొగుళ్ళ వెంకన్న, దేశపంగు మధు, కొచ్చర్ల బాబు, కప్పల రామ్మూర్తి పాల్గొన్నారు.

# జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలో శుక్రవారం జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపసర్పంచ్ మేడిశెట్టి నర్సింహారావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పంచాయితీరాజ్ సంస్థలు గ్రామీణాభివృద్ధి, స్థానిక పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పోల్నేడి శ్రీనివాసరావు, కార్యదర్శి సిసింద్రి, గల్లా అంజమ్మ, చిలక రెడ్డి, అనంగి త్రివేణి, రామప్రభాకర్, ఏఎన్ఎంలు ఉన్నారు.



## హైకోర్టు తీర్పు హర్షణీయం

**ప్రజాపక్షం/రామన్నపేట** : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్ , హరీష్ రావులకు హైకోర్టులో ఊరట లభించడం హర్షనీయమని కోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని రామన్నపేట మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ అపర భగీరథుడిలా కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసి నిర్మించారని గుర్తు చేశారు. ప్రాజెక్టు ద్వారా రైతులకు గణనీయమైన పంటల దిగుబడి సాధించారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలమైందని తాగు సాగు పారిశ్రామిక అవసరాలను తీర్చడంలో కాళేశ్వరం ప్రాజెక్టు కీలకంగా మారిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు, సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, ఈడెం శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండి అమీర్ పాల్గొన్నారు.

## నీర్నముల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేస్తా



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలం నీర్నంల గ్రామంలో జరిగిన గ్రామసభలో గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపినారు. గ్రామానికి నాలుగు నెలల కాలంలో ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం సహకారంతో 10 లక్షల రూపాయలతో రెండు సిసి రోడ్లు పూర్తిచేశానని, 10 లక్షల రూపాయలతో స్త్రీ శక్తి భవన నిర్మాణ పనులు జరుగుతూ ఉన్నాయని, రామన్నపేట శివారు నుంచి లక్ష్మాపురం శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్లను తొలగించడం జరిగిందని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో గ్రామాన్ని మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ మిరియాల.లక్ష్మి ఉప సర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్, వార్డు నెంబర్లు చినపాక రమేష్, శానకొండ రవళి, వీఆర్ఏ చల్ల. ముత్యాలు,పల్లెర్ల.రవీందర్ రెడ్డి ఆవుల లక్ష్మీ నారాయణ, ఏ బూసి. బిక్షం పాల్గొన్నారు.

## ఉద్యోగరీత్యా బదిలీలు తప్పవు

**ప్రజాపక్షం/మోటకొండూర్** : ఉద్యోగ రీత్యా బదిలీలు తప్పవని తేర్యాల సర్పంచ్ మంత్రి లతా స్వామి అన్నారు. శుక్రవారం వారు తేర్యాలలో గత ఆరు సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శి గా అంబాల ఉమేష్ పనిచేస్తూ ఇటీవల మండలంలోని ఆబిద్ నగర్ గ్రామానికి బదిలీపై వెళ్లగా ఆయనకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశిధర్ రెడ్డి, ఉప సర్పంచ్ బాజ మోహన్, వార్డు సభ్యులు బుంగపట్ల శ్రీను, చిన్నం రమేష్, చామల సక్కుబాయి, ఇంద్రాల అండాలు, కొలనుపాక రమ్య పాల్గొన్నారు.



## తక్కువ నీటి వసతితో అధిక దిగుబడి నిచ్చే పంటలను ఎంచుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : రైతులు తక్కువ నీటి వసతితో అధిక దిగుబడిచే పంటలను ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానశాఖ పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని స్టార్ బాంకెట్ హాల్‌లో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసుకోవడం ఎంతో ఉత్తమం అన్నారు. రోజురోజుకు పెరుగుతున్న కూలీల కొరత, నీటి లభ్యత కారణంగా రైతులు ఆయిల్ ఫామ్ సాగుచేయాలన్నారు. ఎన్ఎంఈఓ ఓపి పథకం కింద ప్రభుత్వం మొక్కలు, ఎరువులు, అంతర పంట సాగు బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం మొదటి నాలుగు సంవత్సరాల కాలంలో రూ.50,918లు రాయితీ కింద ఇస్తుందన్నారు. మొక్కల కోసం రైతు తన వాటా కింద ఒక్కో మొక్కకు రూ.20 చొప్పున చెల్లించవలసి ఉంటుందని బిందుసేద్య పరికరాల ఏర్పాటు కోసం మార్గదర్శకాలను అనుసరించి రైతు తన వాటా చెల్లించాలన్నారు. తుంగతుర్తిలోని స్వంత వ్యవసాయ క్షేత్రంలో 25 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నట్లు వివరించారు. త్వరలో 15 ఎకరాలలో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మచైర్మన్ కాసం లింగారెడ్డి, వైస్ చైర్మన్ పంతంగి మల్సూర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్‌రెడ్డి, సురేష్ రావు, ధరావత్ వీరన్న నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి నాగయ్య, ఆయిల్ ఫెడ్ ఇంచార్జి అలీం, కెవికె సీనియర్ హెడ్ డాక్టర్ నరేష్, కెవికె సైంటిస్టులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# వీధి కుక్కలను నియంత్రించాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధి కుక్కల కాటు ఘటనలను తగ్గించేందుకు మునుగోడులో సర్టిలైజేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్రం ఏర్పాటుకు అనుకూలమైన గదులను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేకంగా కుక్కలను పట్టుకునే బృందాలను ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.మండల కేంద్రంలో త్వరితగతిన సర్టిలైజేషన్ కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ నరేష్, సర్పంచ్ రమాదేవి నరసింహా గౌడ్ లకు సూచించారు. ఆర్డిఓ శ్రీదేవి,ఎంపీడీఓ యుగంధర్ రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## నాణ్యమైన వడ్లు తెచ్చి మద్దతు ధర పొందండి

**ప్రజాపక్షం/మోటకొండూర్** : రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన వడ్లు తెచ్చి మద్దతు ధర పొందాలని యాదగిరిగుట్ట ఏడిఏ శాంతి నిర్మల అన్నారు. ఆమె శుక్రవారం పిఎసిఎస్ వంగపల్లి ఆధ్వర్యంలో మోటకొండూర్ మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ మార్కెట్లో దాన్యం కొనుగోలు సిబ్బంది రైతులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని అన్నారు. విద్యుత్ సదుపాయం, ప్యాడి క్లీనర్లు, బారదాన్, లారీలు సరిగా అందుబాటులో లేనందున వడ్లు పట్టడానికి ఇబ్బందులు అవుతున్నాయని రైతులు ఏడిఏకు వివరించగా తక్షణమే విద్యుత్ ఏర్పాట్లు చూడాలని, మంచినీటి సౌకర్యం, లారీలు, ప్యాడీ క్లీనర్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రికార్డ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ మౌనిక, పిఎసిఎస్ కోనుగోలు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## చేనేత హక్కుల సాధన సభ

**ప్రజాపక్షం/రామన్నపేట** : చౌటుప్పల్ శ్రీ పద్మ వంశీ ఫంక్షన్ హాల్‌లో చేనేత హక్కుల సాధన సభలో మాజీ ఎంఎల్‌సి ఎల్.రమణ, మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఇరావత్రి అనిల్ కుమార్, మాజీ ఎంఎల్ఏ వన్నాల శ్రీరాములు, మాజీ ఎంఎల్‌సి చెరిపెల్లి సీతారాములు, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఛైర్మెన్ టి.చిరంజీవులు, జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, శ్రీరాములు, ఎర్రమాద వెంకన్న, మాజీ ఆప్కో డైరెక్టర్లు, ఉద్యమ సంస్థల/వేదికల నాయకులు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పద్మశాలి/చేనేత సంఘాల నాయకులు,కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు చేనేత కళాకారులు, ప్రముఖులు పాల్గొని ముందుగా తెలంగాణ ఫ్రీడమ్ ఫైటర్ కొండా లక్ష్మ ణ్ బాపూజీ గారి చిత్రపటానికి నివాళులు అర్పించి, చేనేత కార్మికుల ఐక్యత మరియు హక్కుల గురించి ప్రస్తావించారు. ఈ సభకు ఇడెం స్వరూప స్మారక సేవాసంస్థ అధ్యక్షులు ఇడెం శ్రీనివాస్, వెల్లంకి గ్రామ సర్పంచ్ ఇడెం రాధ పాల్గొని సభను విజయవంతం చేశారు.





## పోలీసు కుటుంబాలకు ఎస్‌బిఐ స్కీం ఆర్థిక భరోసా

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ఎస్‌బిఐ బ్యాంకు వారు అందిస్తున్న ఇన్సూరెన్స్ స్కీం అకాలంగా మరణించిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక బరోసానిస్తుందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల మరణించిన ఏఎస్ఐ సత్యనారాయణ కుటుంబానికి రూ.10లక్షల శాలరీ ప్యాకెజీ ఎస్‌బిఐ ఇన్సూరెన్స్ చెక్‌ను వారి కుటుంబ సభ్యులకు అందజేసి ఆయన మాట్లాడారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పోలీసులకు ప్రత్యేక శాలరీ ప్యాకెజీ ఇవ్వడం జరిగిందన్నారు. పోలీసు సిబ్బంది మరణించిన క్రమంలో ఈ సాలరీ ప్యాకెజ్ అకౌంట్ ద్వారా రూ.10లక్షల ఇన్సూరెన్స్ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఏఓ మంజుభార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీసు సంఘం అధ్యక్షుడు ఎస్ఐ రామచందర్ గౌడ్, స్టేట్ బ్యాంక్ అధికారులు మోహన్ కుమార్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/చండూరు:** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కళ్లెం సురేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని ఆర్‌టిసి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఎర్రజెల్ల లింగయ్య, బిఆర్ఎస్ మండల నాయకుడు ఆవుల వెంకన్న, చెనగాని చంద్రయ్య మారగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తో తీరిన లోవోల్టేజీ సమస్య

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో నెలకొన్న లోవోల్టేజీ సమస్యను శుక్రవారం విద్యుత్ అధికారులు తీర్చారు. 15కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను మార్చి 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో అంగడిపేటలో ఉన్న లోవోల్టేజీ సమస్య పూర్తిగా తొలిగిపోయింది. లోవోల్టేజీ సమస్య పరిష్కారం అవడం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సాయిగణేష్ , జేఎల్ఎమ్ వర్కాల నవీన్ కుమార్ , బోయపల్లి గణేష్ ,సిబ్బంది పాల్గొన్నారు.

## ఎండలో మూడు గంటలు ఉపాధి కూలీల పడిగాపులు

**ప్రజాపక్షం/చివ్వెంల** : ఎండలో మూడు గంటలపాటు ఉపాధి కూలీలు పడిగాపులు కాసిన సంఘటన శుక్రవారం మండలంలోని చందుపట్ల గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధి పని ఉందని చెప్పడంతో 300 మంది కూలీలు పని కోసం వెళ్ళగా లొకేషన్ కాలేదు, మస్టర్ లేదని ఫీల్డ్ అసిస్టెంట్ గుయ్యం రవి చెప్పడంతో ఉదయం 7 గంటలకు పనికి వచ్చిన కూలీలు 11 గంటల వరకు అక్కడే పడిగాపులు కాసిన పరిస్థితి. ఇదిలాఉంటే పనికి వచ్చిన వారు హాజరు పడకున్నా 12 గంటల వరకు అక్కడే ఉండాలని ఆయన ఆర్డర్ జారీ చేయడంతో ఉపాధి కూలీలు ప్రశ్నిస్తే నా వద్ద పనిచేసేవారు నాకు ఎదురు చెప్పవద్దని దబాయించారని కూలీలు వాపోయారు.





## అనారోగ్య బాధితురాలి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామానికి చెందిన మెరిగ కృష్ణవేణి గత కొన్ని రోజులుగా అనారోగ్య పరిస్థితుల వల్ల బాధపడుతూ ఉన్నారు. విషయం తెలుసుకున్న భారత జాతీయ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ వారిని పరమార్శించారు. మెరుగ కృష్ణవేణికి ఒక చీరెను సారెగా పెట్టి వారి పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి కొంత ఆర్థిక సాయం అందించి బాధితురాలికి ఏమైనా అవసరాలు ఉంటే సహాయం చేయడానికి ముందుకు రావాలని దాతలను కోరారు. కృష్ణవేణి తగంలో వెన్నపూసకు సంబధించిన వ్యాధితో బాధపడుతున్నారని దీంతో ఆమె కాళ్లు పూర్తిగా చచ్చుపడిపోయాయని అన్నారు. దీంతో ఆమె ఆర్థికసాయాన్ని భరించలేక ఆర్థికసాయం చేసే వారి కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు.

## ఆర్టీసీ కార్మికుల ప్రాణాలతో చెలగాటం

**ప్రజాపక్షం/కోదాడ:** నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌ను శుక్రవారం కోల్పోవడం అత్యంత విషాదకరమని, ఆర్టీసీ ఉద్యోగులు ఇలాంటి దయచేసి ఈలాంటి చర్యలకు పాల్పడవద్దని ప్రాణం చాల విలువైనదని మీ కుటుంబాలు మీ మీదనే ఆధారపడి వున్న విషయం మర్చిపోవద్దని బిఆర్ఎస్ నాయకులు పచ్చిపాల వేణు యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికులు తమ డిమాండ్లను సాధించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోవాలని,మీ న్యాయమైననిర్ణయాలు మాత్రం తీసుకోవద్దని మీ న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజా సమస్యలను పక్కనబెట్టి రాజకీయ ఆరోపణలు,ప్రతిఆరోపణలతో కాలక్షేపం చేయడం సమంజసం కాదని బిఆర్‌టి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ పేర్కొన్నారు.శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ప్రసన్న రాజు క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు 42 హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,మాజీ మంత్రి హరీష్ రావుపై బూటకపు ప్రచారాన్ని తక్షణమే మానుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు చౌగోని శంకర్,చెరుకు వెంకటాద్రి,యాతాకుల సోమయ్య, వనం చంద్రరావు, సైదిరెడ్డి,సైదులు, కందాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



## టిపిటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/కోదాడ: రాష్ట్రంలోని బడిఈడు పిల్లలందరికి ప్రభుత్వమే బాధ్యతగా, ఉచితంగా, నాణ్యమైన విద్యను అందించాలని దానికి కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడమే స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడమే ప్రధాన కారణమని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాపర్తి రామనర్సయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బిక్షం లు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఒక ఆవాస ప్రాంతంలో చదివే విద్యార్థులు, చైనా మాదిరిగా ప్రైవేట్ పాఠశాలను రద్దు చేసి ప్రభుత్వమే స్వాదీన పర్చుకోవాలని కోరారు. గడిచినప్పటికీ రెండవ పిఆర్‌సి నివేదికను తెప్పించుకుని అమలు చేయకపోవడం సరైంది కాదని, వెంటనే రెండవ పిఆర్‌సి నివేదికను బహిర్గతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈనెల 30న టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు పాఠశాల డైరెక్టర్ నవీన్ నికోలాస్, తెలంగాణ ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ కోదండరాం, నాయకులు హరిగోపాల్, తెలంగాణ అసమాన విద్యారంగ సంక్షోభం అను అంశంపై ఉస్మానియా యూనివర్శిటి ఆర్ట్స్ కళాశాల ప్రొఫెషర్ చింతకింంది కాశీం, పచ్చిమాశియా యుద్ధం ప్రపంచ రాజకీయాలు అనే అంశంపై ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకులు కె. శ్రీనివాస్ ప్రసంగించనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బడుగుల సైదులు, ఎ. హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పింఛన్ రూ. 6000 పెంచి అమలు చేయాలి




**ప్రజాపక్షం/భువనగిరి :** పెన్షన్ 6000లకు పెంచి వెంటనే అమలు చేయాలని, వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్యమం చెయ్యాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య అన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృత సమావేశంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు సూరపంగా ప్రకాష్ అధ్యక్షతన దుంపల మల్లారెడ్డి స్మరక భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం అడివయ్య మాట్లాడుతూ 2026/27 బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమనికి అవసరమైన నిధులు కేటాయించలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత 1.69 లక్షల మంది పెన్షన్స్ రద్దు చేశారాని అన్నారు. మే 29,31 తేదీల్లో యాదగిరిగుట్టలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్లినం నిర్వహిస్తున్నామని తెలిపారు. 33 జిల్లాల నుండి 500 మంది ప్రతినిధులు హాజరు అవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి స్వామి, జిల్లా అధ్యక్షులు సూరపంగా ప్రకాష్, కార్యదర్శి వి ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె లలిత, జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్,ఆంజనేయులు, బర్ల పార్వతి, సహాయ కార్యదర్శులు శంకర్, శ్రీహరి పాల్గొన్నారు.

## అత్యాధునిక ప్రేస్ శస్త్ర చికిత్సతో క్రానిక్ ప్యాంక్రియాటైటిస్కు మలక్‌పేట యశోదలో విజయవంతంగా చికిత్స




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లాకు చెందిన రోగికి హైద్రాబాద్ నగరంలోని మలకల్‌పేటలో గల యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక ప్రేస్ శస్త్ర చికిత్సతో క్రానిక్ ప్యాంక్రియాటైటిస్కు చికిత్సను విజయవంతంగా చేసి ఘనత సాధించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ లలిత్‌కుమార్‌రెడ్డి కంతాల మాట్లాడుతూ క్రానిక్ ప్యాంక్రియాటైటిస్ అనేది ప్యాంక్రియాస్లో దీర్ఘకాలిక వాపు కారణంగా ఏర్పడే తీవ్రమైన వ్యాధి అని ఇది క్రమంగా ప్యాంక్రియాస్ పనితీరును దెబ్బతీస్తూ తీవ్రమైన కడుపు నొప్పి, జీర్ణ సమస్యలు, మధుమేహం వంటి సమస్యలకు దారి తీస్తుందన్నారు. సమయానికి చికిత్స చేయకపోతే ఈ వ్యాధి ముదిరి తీవ్రమై జీవన నాణ్యతను గణనీయంగా తగ్గిస్తుందన్నారు. జిల్లాకు చెందిన 40 ఏండ్ల పురుష రోగికి క్రానిక్ ప్యాంక్రియాటైటిస్, ఫిస్టులా ఇన్ అనో సమస్యలతో మలక్‌పేట యశోద సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో చేరగా విజయవంతంగా చికిత్స అందించడం జరిగిందన్నారు. నిరంతర పర్యవేక్షణ, సహాయక చికిత్సతో పోస్ట్ ఆపరేటీవ్ దశ సజావుగా సాగి రోగి క్రమంగా కోలుకున్నాడని తెలిపారు. సమావేశంలో మలక్‌పేట యశోదా ఆసుపత్రి స్పెషాలిటి ఆసుపత్రి మార్కెటింగ్ లక్ష్మణ్ శ్రీకాంత్, హరీష్, వాసుకిరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మహనీయులు చూపిన బాటలో పయనించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహనీయుల చూపిన ప్రజ్ఞ, కరుణ,పోరాటాల బాటలో ముందుకు సాగాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్తం పిలుపునిచ్చారు.శుక్రవారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ విద్య ద్వారా సంక్లిష్టతలకు సమాధానాలు,సన్మార్గానికి, సామరస్యతలకు బాట లు వేస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని విద్యను సాధనంగా భావించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యా ద్వారా పరిపూర్ణమైన మార్పుతో పాటు ప్రపంచాన్ని పరిచయం చేసి ముందుకు నడిపించే సాధనంగా కీర్తించారు. ఈ కార్యక్రమంలోఆచార్య అబ్దుల్ మాలిక్, రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,ఆర్టిఐ కమిషనర్ దేశాల భూపాల్,ఆచార్య సరిత,ఆచార్య అలువాల రవి,డాక్టర్ రవితేజ,ఆచార్య వసంత,డాక్టర్ అరుణప్రియ,డాక్టర్‌ప్రేమ్ సాగర్, డాక్టర్ మద్దిలేటి, జ్యోతి,సబీనా హెరాల్డ్,హరీష్ కుమార్,దోమల రమేష్,మిరియాల రమేష్ తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



## చేనేత సహకార సంఘాల సభ్యత్వ నమోదు ప్రారంభం

**ప్రజాపక్షం/రామన్నపేట :** స్థానిక పట్టణ కేంద్రంలో గల చేనేత కాటన్ సహకార సంఘంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాగరాజు విచ్చేసి సహకార సంఘాల సభ్యత్వాల్లో నమోదుపై జరుగుతున్న కొన్ని అవకతవకల గురించి సంఘ పెద్దలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పద్మశాలి సహకార సంఘంలోని సభ్యత్వాలు గతంలో పలుకుబడి కలిగిన పద్మశాలి నాయకులు వారి వారి సొంత సభ్యులను మాత్రమే సభ్యత్వ నమోదు ప్రక్రియలో భాగం చేసేవారని, అందువలన సాధారణ మధ్యతరగతికి చెందిన చేనేత వృత్తిపై ఆధారపడి బ్రతుకుతున్న వారికి ఎలాంటి సభ్యత్వాలను నమోదు చేయించకపోయారని, తనతో అందరూ సహకరించి తాను చేస్తున్న ఈ ఉద్యమానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కాటన్ సహకార సంఘం అధ్యక్షులు జెల్లా వెంకటేశం, వనం నరసింహ, పెండెం భావనాఋషి, పెండెం వేణు, దొంత నాగరాజు, గంజి అశోక్, పట్టణ కుల సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, కార్యదర్శి కైరంకొండ నాగభూషణం పాల్గొన్నారు.

## నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ జిల్లా చైర్ పర్సన్‌గా లీలారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నేచరల్ వెల్ఫేర్ కౌన్సిల్ నల్లగొండ జిల్లా చైర్ పర్సన్‌గా బొమ్మిరెడ్డి లీలారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమన్నారు. పంచభూతాల సంరక్షణతో గ్రీన్ నల్లగొండగా జిల్లా అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. జిల్లాలో పది లక్షల మొక్కలు నాటి నీటి, గాలి, పరిశ్రమల వల్ల కలిగే కాలుష్యాన్ని నియంత్రిస్తానన్నారు. అదేవిధంగా పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలు, రైస్ మిల్లులు, కెమికల్ పరిశ్రమల వల్ల కలుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఫ్యాక్టరీల యజమాన్యాలతో చర్చలు జరుపుతానన్నారు. తన నియాకమానికి సహకరించిన తెలంగాణ నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఛైర్మన్ జనతా రామ్, ఆంధ్రప్రదేశ్ నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఛైర్మన్ అంబటి నవకుమార్, వెల్ఫేర్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ సతీష్ వంగాల, ఫుడ్ కమిషన్ మెంబర్ ఎస్.నాగయ్య, జాతీయ కమిటీ సభ్యులు, నేషనల్ ఛైర్మన్ రాహుల్ ద్వివేదిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి బాధాకరం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి బాధాకరమని ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తూ పోరాడుతూ హక్కులు సాధించుకోవాలే తప్పా ప్రాణత్యాగాలు చేసుకోవడం బాధాకరమన్నారు. నర్సంపేట డిపో పరిధిలోని ఆర్టీసీ డ్రైవర్ శంకర్‌గౌడ్ పెట్రోల్ పోసుకోని ఆత్మహత్య చేసుకోవడం పట్ల ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. 40 రోజుల క్రితం నోటీసులు ఇచ్చినప్పుడు ప్రభుత్వం స్పందించి ఉంటే నిండు ప్రాణం బతికేదని అన్నారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## చెక్కులు అందజేత

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం పెద్ద గూడెం గ్రామంలో శుక్రవారం సర్పంచ్ పకీరు లత నర్సిరెడ్డి ఆధ్వర్యంలో వెల్వర్తి బుచయ్యకు రూ.60 వేలు, గంగమోని మంజులకు రూ.50 వేలు, ఒంటెద్దు రాములుకు రూ.29.5 వేలు, బూరుగు లక్ష్మణ్‌కు రూ.22.5 వేలు రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎస్ఎస్ చైర్మన్ ఫకీర్ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్ రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, వార్డు మెంబర్లు దొంతి లింగమయ్య, దొంతి బాలరాజు, మన్నె సునంద, కొంగరి అండాలు తదితరులు ఉన్నారు.



## ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆర్టీసీ సమ్మెకు బీసీ సంఘం మద్దతు ఉంటుందని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమ్మె రోజురోజుకు ఉధృతం అవుతున్న సందర్భంలో వరంగల్ జిల్లా నర్సంపేటలో శంకర్‌గౌడ్ అనే కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కార్మికులు రోజుల తరబడి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే కాకుండా డ్రైవర్, కండక్టర్ స్థానంలో ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులతో పోలీస్ బందోబస్తు మధ్య బస్సు సర్వీసులు నడపడంతో సమ్మె ఉధృతికి కారకులవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, జిల్లాపెల్లి అంజి, అనంతయ్య, పగిళ్ల సతీష్, నాగేశ్వర్ రావు, భద్రం, రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని కొర్రో నితండాకు చెందిన కొర్ర సాల కిషన్ నాయక్‌ల కుమారుని రిసెప్షన్ వేడుకలో శుక్రవారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, కొర్ర తండా సర్పంచ్ బుజ్జి లక్ష్మణ్‌నాయక్, ఉప సర్పంచ్ కొర్ర నాగరాజునాయక్, మాజీ సర్పంచ్ లాల్‌సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

## జాతీయ పంచాయతీరాజ్ వారోత్సవాలు

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని 32 గ్రామపంచాయతీలలో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచులు గ్రామపంచాయతీలలో గ్రామసభలను ఏర్పాటు చేసి ప్రజలతో కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.గ్రామసభల్లో గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు,త్రాగునీటి సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, ఉపాధి హామీ పథకం అమలు వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం ద్వారానే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని తెలిపారు.

## పరామర్శ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు ముత్యం సోమయ్యగౌడ్ కుమారుడు ముత్యం మహేష్‌గౌడ్ (పోలీస్ కమాండర్)ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడంతో బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్‌గౌడ్ శుక్రవారం మహేష్ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సోమనరసయ్య, జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా బిజెవైఎం జనరల్ సెక్రటరీ కుమార స్వామి, ఉదయ్‌కిరణ్, నాగయ్య, మండల అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర

**ప్రజాపక్షం/ దేవరకొండ;** పేద విద్యార్థుల ఉన్నత విద్య అభ్యసించేందుకు రూపొందించిన ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని బిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు యావత్తు విద్యా వ్యవస్థను కుదిపేసిందని, ఈ ఒక్క తీర్పు తో వేలాది మంది విద్యార్థుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని అన్నారు. దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులకు ఆశా దీపంగా మారిన ఈ పథకం ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నుండి స్పందన కరువైందని ఈ పథకాన్ని కొనసాగిస్తామని ప్రకటన ఇంతవరకు రాలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేసి ప్రైవేట్ కాలేజీల వేదింపుల నుండి విద్యార్థులను రక్షించాలని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ అబద్ధాలు, దుష్ప్రచారాలు ప్రస్ఫుటం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల పీసీ ఘోష్ కమీషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ అబద్ధాలు, దుష్ప్రచారాలు బయటపడ్డాయని మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరరావు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంప పెట్టు లాంటిదన్నారు. కాంగ్రెస్ రాజకీయ లబ్ది కోసం బీఆర్ఎస్ నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ఇలాంటి కుట్రలతో తిరిగి ప్రాధాన్యం సంపాదించాలని చూస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి భయపడుతున్న కాంగ్రెస్ నాయకులు, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు చేస్తూ రాష్ట్రాన్ని అస్థిరపరచాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో చిట్టిబాబునాయక్, మోసిన్అలీ, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఇలియాస్, భిక్షం, మాజీద్, దైద సత్యం, వేణుగోపాల్‌రావు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల్లో నైతిక విలువలు పంచే విధంగా ఒకేషనల్ బైబిల్ స్కూల్



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ స్థానిక హిల్ కాలనీలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో నిర్వహిస్తున్న వి.బి.ఎస్ (వేకేషనల్ బైబిల్ స్కూల్) కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.ఈకార్యక్రమాన్ని రెవరెండ్ ఫాదర్ ఎడ్ల రాజేశ్వరరావు,రెవరెండ్ ఫాదర్ ఎడికెవి ప్రసాద్ ఆధ్వర్యంలో సంఘ పెద్దల సమక్షంలో ప్రారంభించారు.మొదటి రోజు నిర్వహించిన ఈశిక్షణ కార్యక్రమంలో సుమారు 60 మంది చిన్నపిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతో ఈ విబిఎస్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు బైబిల్ కథలు,ఆధ్యాత్మిక పాటలు,వినోదాత్మక కార్యాచరణల ద్వారా క్రైస్తవ ధర్మంలోని నైతిక విలువలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నామని రెవరెండ్ ఫాదర్ ఎడ్ల రాజేశ్వరరావు తెలిపారు.పిల్లల్లో మంచి ప్రవర్తన, ప్రేమ,క్రమశిక్షణ వంటి గుణాలను పెంపొందించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు పిల్లల ఆత్మీయ,మానసిక అభివృద్ధికి దోహదం చేస్తాయని సంఘ పెద్దలు అభిప్రాయపడ్డారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**ప్రజాపక్షం/రామన్నపేట :** ఉపాధి హామీ కూలీలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఉపాధి హామీ పనులను గ్రామ కార్యదర్శి ఉమాశంకర్‌తో కలిసి పరిశీలించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పనిచేస్తున్న కూలీలకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఓఆర్ఎస్ ప్యాకెట్లను, తాగు నీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలో పనిచేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై టోపీ లేక తలపాక ధరించాలని సూచించారు. అవసరమైనపుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా



నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉదయశ్రీ, ఏఎన్ఎం కేతమ్మ, నడిగోటి గణేష్, జోగు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** మన గ్రామాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలునాయక్, పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్, వార్డు సభ్యులు లక్ష్మీ ప్రశాంత్,



కిషన్‌నాయక్, సంతోషవెంటక్, నాగరాజు, ఏఎన్ఎం విజయ, ఎంఎల్‌హెచ్‌పి స్వాతి, అంగన్‌వాడీ టీచర్లు కమలమ్మ, బుజ్జి, లచ్చి, ఆయా కలమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసి డ్రైవర్ శంకర్‌గౌడ్‌ది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్యే

**ప్రజాపక్షం/ దేవరకొండ ;** నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్‌గౌడ్ ది ఆత్మహత్య కాదని అది ముమ్మాటికి రేవంత్ సర్కార్ చేసిన హత్యే అని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కార్మికుల ప్రాణాలు ఇలా చవకబారి పోయాయా ఇందు కోసమేనా పోరాడి తెలంగాణ సాధించుకుందని ఆయన అన్నారు. ఆర్టీసి కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఒక అమాయక ప్రాణం బలైందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో హామీలను ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. తక్షణమే శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆత్మహత్యలతో డిమాండ్ల పరిష్కారం కావు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆత్మహత్యలతో డిమాండ్లు, సమస్యలు, హక్కులు పరిష్కారం కావని నిరసనలు, ఆందోళనల ద్వారా పరిష్కారం అవుతాయని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ కోరారు. శుక్రవారం ఆయన మిర్యాలగూడలో మాట్లాడుతూ తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ఆంఒళనలకు అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలుపుతారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్లు చేయడం విధులు బహిష్కరించి నిరసన తెలపడం తప్పు కాదన్నారు. కార్యక్రమంలో బిక్కునాయక్, మక్లానాయక్, బద్దునాయక్, శ్రీనివాస్, లాలునాయక్, జామ్లానాయక్, సైదానాయక్ పాల్గొన్నారు.

## శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శ



**ప్రజాపక్షం/చివ్వెంల :** మండలంలోని గుంజలూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దేవరం శ్రీనివాస్ రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పరామర్శించారు. ఆయన తండ్రి వెంకట్‌రెడ్డితోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. శ్రీనివాస్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్ రెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులు, మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.

## రెండో విడత శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో సెన్సస్ 2027 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫీల్డ్ ట్రైనర్లు జంపాల రాజు, సుధాకర్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంపిడివో చంద్రీరాణి మాట్లాడుతూ సెన్సస్ 2027 కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లు పూర్తి పారదర్శకతతో సమాచారాన్ని సేకరించి నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ చేసి డాటాను ధృవీకరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం

ప్రజాపక్షం/రామన్నపేట : ఆర్టీసీ కార్మికులు ఆర్టీసీ రక్షణ కోసం, సమస్యల సాధనకై ఆర్టిసి కార్మికులు చేస్తున్న సమ్మెకు ఇంద్రపాలనగరం గ్రామసర్పంచ్ గర్దాస్ విక్రమ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న ఆర్టిసి కార్మికులకు బిఆర్ఎస్ పార్టీ తరుపున ఆయన పూర్తి మద్దతు తెలిపారు. అధికార దాహంతో, అబద్దాలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టిసి రక్షణ, సమస్యల పరిష్కారాల కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఆర్టిసి కార్మికులకు అండగా నిలవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోలా శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

# ఉపాధి హామీ కూలీలకు ఆన్‌లైన్ కష్టాలు



కళ్ల స్కానింగ్ పడక కడుపు మాడుతున్న వైనం

ఎన్ఎంఎంఎస్ యాప్‌తో హాజరు నమోదు లేక నిలిచిపోతున్న వేతనాలు



**ప్రజాపక్షం/నాంపల్లి** : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో అమల్లోకి వచ్చిన కొత్త ఆన్‌లైన్ హాజరు విధానం కూలీలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది.ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్ ద్వారా ముఖ గుర్తింపు, కళ్ల స్కానింగ్ ఆధారంగా హాజరు నమోదు చేయాల్సి రావడంతో వేలాది మంది పేద కూలీలు వేతనాలు లేక అల్లాడిపోతున్నారు.

కేంద్ర ప్రభుత్వం పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఈఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానం గ్రామీణ కూలీలకు భారంగా మారింది.ఆధార్ కార్డులోని పాత ఫోటోలు,ప్రస్తుతం ముఖ కవళికలు సరిపోకపోవడం వల్ల హాజరు నమోదు కావడం లేదు.ముఖ్యంగా వృద్ధుల కనుపాపలు (ఐరిస్) స్పష్టంగా లేకపోవడం, ముఖం గుర్తించకపోవడం వల్ల పదే పదే ప్రయత్నించి నామ్యాచింగ్ ఫయిల్డ్ అని చూపుతుండటంతో వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు.మండుతున్న ఎండల్లో ఉదయం నుంచే పని ప్రదేశానికి చేరుకున్నా హాజరు నమోదు కావడానికి గంటల సమయం పడుతోంది. ఎండలో కళ్లను సరిగా తెరవలేక స్కానింగ్ జరగకపోవడం మరో సమస్యగా మారింది.మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సిగ్నల్ లేక ఫీల్డ్ అసిస్టెంట్లు ఫోటోలు అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. దీంతో పనిచేసిన రోజులు కూడా మాస్టర్‌లో నమోదు కాకుండా పోతున్నాయి.పొద్దున్నే వచ్చి గడ్డపార పట్టి పని చేస్తున్నాం.కానీ ఫోన్‌లో మాకళ్ల స్కాన్ పడటం లేదంటున్నారు.కొన్ని రోజులుగా పనికి వస్తున్నా ఒక్క రోజు కూడా హాజరు నమోదు కాలేదు.కూలి రాకపోతే మా బతుకులు ఎలా?అని ఓ వృద్ధ కూలి ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల కూలీలు హాజరు కోసం ముఖానికి పౌడర్ అద్దుకోవడం,నీడలో నిలబడి ఫోటోలు దిగడం వంటి వినూత్న ప్రయత్నాలు చేస్తున్నా సమస్యలు మాత్రం తగ్గడం లేదు.ఈ సమస్యపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.సాంకేతికత పేరిట పేదల పొట్ట కొట్టవద్దని, సర్వర్ సమస్యలు, ముఖ గుర్తింపు లోపాలు తొలిగే వరకు పాత విధానం లోనే హాజరు నమోదు చేయాలని డిమాండ్ చే స్తున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి యాప్‌లో మార్పులు చేయకపోతే ఉపాధి హామీ పథకం లక్ష్యం దె బ్బతినే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**కూలీ రాకపోతే మా బతుకులు ఎలా**

**వృద్ధ కూలీ తిరుమణి ముత్తయ్య**



మండుతున్న ఎండల్లో ఉదయం నుంచే పని ప్రదేశానికి చేరుకున్నా హాజరు నమోదు కావడానికి గంటల సమయం పడుతోందని వృద్ధ కూలి తిరుమణి ముత్తయ్య చెప్పుకొచ్చారు. ఎండలో కళ్లను సరిగా తెరవలేక స్కానింగ్ జరగకపోవడం మరో సమస్యగా మారింది. కొన్ని రోజులుగా పనికి వస్తున్నా ఒక్కరోజు కూడా హాజరు నమోదు కాలేదు.కూలి రాకపోతే మా బతుకులు ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు.

**సాంకేతికత పేరిట పేదల పొట్ట కొట్టవద్దు యాప్‌లో మార్పులు చేయాలి :లొడంగి శ్రవణ్ కుమార్**

**(తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు)**



సాంకేతికత పేరిట పేదల పొట్ట కొట్టవద్దని,సర్వర్ సమస్యలు,ముఖ గుర్తింపు లోపాలు తొలిగే వరకు పాత విధానంలోనే హాజరు నమోదు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లొడంగి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించి యాప్‌లో మార్పులు చేయకపోతే ఉపాధి హామీ పథకం లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.

## హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మెదులుకోవాలని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగింది అని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పడం అవగాహన రహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కోట మల్లారెడ్డి పుష్పలత, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ భూపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## సొంత ఇంటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/చండూరు:** పేదలకు సొంత ఇంటి కల కాంగ్రేస్ ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని కాంగ్రేస్ పార్టీ చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి సహకారంతో చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 4వార్డు చెందిన పనస మహేష్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం కార్యక్రమంలో చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్ , మహేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గొర్ల సాలమ్మ గత కొద్ది రోజుల క్రితం పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారికి ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం చొరవతో జిల్లా నాయకులు పూస బాలకిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం నుండి ఎల్ఓసి ద్వారా రూ.2,50,000 విలువైన చెక్కును గొర్ల సాలమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.



## మన ఫ్రెండ్స్ కమిటీకి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలోని నాలుగోవార్డ్ సంతోష్ నగర్‌కు చెందిన కాలనీ పెద్దలు కాలనీ అభివృద్ధి కోసం నూతనంగా సంతోష్ నగర్ మన ఫ్రెండ్స్ కమిటీని ఏర్పాటు చేసుకొని వార్డ్ కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఆమె శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.రాజకీయాలకతీతంగా కాలనీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారు.అధ్యక్షులుగా నకిరేకల్ పట్టణ ప్రముఖులు న్యాయవాది అక్కెనపల్లి వీరస్వామి,ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ ఉపాధ్యాయులు పొడిశెట్టి శంకర్,కోశాధికారి న్యూ విజన్ కరస్పాండెంట్ కొంగరి లింగయ్య, తదితరులు ఉన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/త్రిపురారం:** వేసవికాలం దృశ్య ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానిక సర్పంచ్ బైరం లక్ష్మి కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలో ఎన్ఎస్‌పి క్యాంపులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతోఉపయోగపడుతుందన్నారు. మట్టి కుండలో నిలువఉంచిన నీరు త్రాగుతే ఆరోగ్యానికి మంచిదని ఆమె పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజు,ఉపసర్పంచ్ అనుమల నాగమణి,ఫీల్డ్అసిస్టెంట్ వెంకన్న,వార్డు మెంబర్లు ప్రజలు పాల్గొన్నారు.

## మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీమ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం మండల జనరల్ బాడీ సమావేశం చిలుముల లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. లేబర్ కోడ్స్ అమలవుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి మేడే జెండాలను ఎగురవేసి పోరాట స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ నాయకులు వంటేపాక వెంకటేశ్వర్లు,ఆది మల్ల సుధీర్,తాడ్వాయి రాములుపాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన వరిపల్లి ప్రశాంత్ ఆకస్మికంగా మరణించడంతో విషయం తెలుసుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ బాబు శుక్రవారం ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శించి మానవసేవే మాధవ సేవా అనే నినాదంతో ముందుకెళుతూ రూ. 5వేల ను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మల్లెపాక పరశురాములు, మధన్‌మోహన్, రాజు, సురేష్, నవీన్, ఉపేందర్, శ్రీకాంత్, చైతన్య, సత్తయ్య, మహేష్, నరేష్, సత్తయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

